


నేటి ఉదయం

తెలుగు దినపత్రిక



ప్రచురణ : విజయనగరం | ఆదివారం 01-11-2026 | చీఫ్ ఎడిటర్ : కె వి ఎల్ ఎస్ బాలసుబ్రహ్మణ్యం | సంపుటి : 1 | సంచిక : 102 | పేజీలు : 4 | వెల : 2.00



(ఉదయం న్యూస్ బ్యూరో)

కేసుల ముప్పు తప్పించుకోడానికో.. లేక కూతురికి జెడ్పీ పీఠం కట్టబెట్టాలనే దృఢ సంకల్పంతోనో.. రెండు కారణాలు కావచ్చు నేమో గాని చిన్న శ్రీను అనే వ్యక్తి ఎప్పుడైతే పార్టీ మారారో.. అప్పటి నుంచి అలా రాజకీయ జూదం ఆడుతునే ఉన్నారు.. పార్టీ మారడమే పెద్ద జూదం అనుకుంటే అంతకు సమానమైన ఆటలు చాలా ఆడుతున్నారు చిన్న శ్రీను గత నెలన్నర నుంచి.. పార్టీ మారారు.. అఫ్కోర్స్.. ఆయనతో పాటు కొందరు ఊహించినట్టు..ఆయన వర్గమే పెద్దగా ప్రచారం చేసుకుందేమో గాని.. మొత్తానికి చిన్న శ్రీను వెంట వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీలోకి జనం క్యూ కట్టెయ్యలేదు గాని వలసలైతే జరిగాయి.పార్టీ మారినప్పటి నుంచి ఇంతకు ముందు ఎవరూ చెయ్యని రీతిలో తెలుగుదేశం ఎమ్మెల్యేల ఇళ్ళకి వెళ్లి కలవడం..ఆ మొత్తం ములాఖత్లకు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకోవడం ఇదంతా ఒక పరంపర.. ఈ హడావిడి సద్దుమణగక ముందే మున్సిపల్ ఎన్నికల హడావిడి..తన కూతురు సిరి సహస్రకు విజయనగరం మేయర్ పదవికి కూటమి అభ్యర్థిత్వం ఖరారు చేయించుకునేందుకు శతవిధాలా ప్రయత్నం.. మొత్తానికి అదితి జోక్యంతో ఆ ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో టార్గెట్ జెడ్పీ.. అంటూ అసలు పోరాటానికి తెర లేపారు. ముందుచూపుతో ఎప్పుడో సిద్ధం చేసి పెట్టుకున్న సిరి సహస్ర కుల ధృవీకరణ సర్టిఫికెట్ ను అవసరానికి ముందే బహిర్గత పరచి సం"కుల" సమరానికి సిద్ధమయ్యారు. ఓసీ జెడ్పీటీసీ నుంచి కూతురు చేత నామినేషన్ వేయించి అక్కడ అవసరం లేకపోయినా బిసి సర్టిఫికెట్ ను సమర్పించి..ఆ సర్టిఫికెట్ ఆధారంగా నామినేషన్ ఫీజు కూడా తక్కువ కట్టి జెడ్పీ కుర్చీపై ముందుగానే కర్చీఫ్ వేసేశారు.అయిందో లేదో గాని సిరి జెడ్పీ అభ్యర్థిత్వాన్ని చంద్రబాబు..లోకేష్ ఖరారు చేసేసారని తెగ ప్రచారం జరిగిపోతోంది.. ఇవన్నీ చిన్న శ్రీను ఆటలో భాగమేనని పరిశీలకులు అనుకుంటున్నారు. ఇప్పుడు అసలు కథ చెప్పుకుంటే.. జెడ్పీ పీఠంపై సిరిని ప్రతిష్టించడానికి ప్రధాన అవరోధం కులం..అది ఇప్పటికే కలకలం..విషయం కోర్టులోనే తేలాలి.. అది ఎన్నిక లోపు జరుగుతుందో.. యధావిధిగా తాత్సారం జరిగి పదవీకాలం పూర్తయ్యే లోగా జరుగుతుందో లేదో.. చెప్పలేమని కొందరి ఉవాచ. ఆ విషయాన్ని పక్కన బెడితే ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో జెడ్పీ పీఠానికి ప్రత్యర్థులు కిమిడి.. కర్రోతు..కంది కుటుంబాలు..రేసులో కంది లేరనే ప్రచారం అప్పుడే జరిగిపోయింది.కర్రోతు విషయాన్ని అధిష్టానానికి వదిలేశారని ఇంకో టాక్. ఇక మిగిలింది కిమిడి ఫ్యామిలీ నుంచి సంధ్య..! సంధ్యతో గరివిడిలో పోటీ పడుతోంది సాక్షాత్తు తన బావ సత్తిబాబు కోడలు పూజిత.. గరివిడిలో చిన్న శ్రీనుకి గల పలుకుబడి అందరికీ తెలిసిందే.. అక్కడ చిన్న శ్రీను అండర్ గ్రౌండ్ నెట్ వర్క్ కారణంగా.. ఫ్యామిలీ అడ్జస్ట్మెంట్లో పూజిత గెలిచేస్తే కిమిడి కుటుంబం అడ్డంకి తొలగిపోయినట్టే.. పూజిత గెలిచినా గాని వైసిపికి జెడ్పీ పీఠాన్ని సాధించే బలం ఉండదు గనుక... "గరివిడి" నుంచే బుర్రలు మార్చే బుర్ర కథ మొదలవుతుందని అనుకుంటున్నా రు. అదేదోసినిమాలో ఎవరోఅన్నట్టు పెద్ద ట్విస్టే..!

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

సహాయ ఎన్నికల అధికారి బాలస్వామి వెల్లడి

ఉదయం ప్రతినిధి - విజయనగరం

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సహాయ ఎన్నికల అధికారి, కమిషనర్ బి బాలస్వామి వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలో 62 వార్డులు, మేయర్ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో 229 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం 2,23, 050 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,15,015 మంది మహిళలు కాగా,1,08, 010 మంది పురుషులు, 25 మంది ఇతరులు ఉన్నారు. 229 పోలింగ్ కేంద్రాల్లో సాధారణ పోలింగ్ కేంద్రాలు 122 కాగా, సమస్యాత్మకం 81, అతిసమస్యాత్మకం 26 కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. నగర పాలక సంస్థ ఎన్నికలో 169 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. ఏడుగురు మేయర్ స్థానం కోసం పోటీలో నిలిచారన్నారు. ఆదివారం పోలింగ్ కోసం సామగ్రి తరలింపు తో పాటు పోలింగ్ కు అవసరమైన ఏర్పాట్లు కూడా పూర్తి చేసినట్లు చెప్పారు. సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ తో పాటు సీసీ కెమెరాలు పర్యవేక్షణతో గట్టి నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్లు పోలింగ్ బూతులలో సెల్ ఫోన్లు తీసుకురాకూడదని, సెల్ ఫోన్లతో పోలింగ్ బూత్ లోకి అనుమతించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఓటర్లు గమనించాలని కోరారు. భారత ఎన్నికల సంఘం అందించిన ఓటర్ గుర్తింపు కార్డు గాని, ఇతర అధికారిక పత్రాలు అనగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాస్ పోర్టు,పాన్ కార్డు వంటి కార్డులలో ఏదైనా ఒకటి ఓటింగ్ వేసే సమయంలో పోలింగ్ బూత్ వద్ద ఉన్న ఎన్నికల సిబ్బందికి చూపించి లోనికి




ప్రవేశించాలన్నారు. ఓటరు తమతోపాటు తెచ్చుకున్న ఓటర్ స్లిప్పు గుర్తింపుదగినది కాదని, ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఓటర్ స్లిప్ తోపాటు పైన పేర్కొన్న విధంగా ఏదేని ప్రభుత్వం మంజూరు చేసిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఓటర్లు నిర్భయంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా, స్వేచ్ఛాయుతంగా అందరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని బాలస్వామి కోరారు.

స్థానిక ఎన్నికల్లో వైసీపీ గెలిపించండి అభివృద్ధి ఏమిటో చూపిస్తాం

ఉదయం ప్రతినిధి - గజపతినగరం

మండలంలోని మదుపాడ. లింగాలవలస గ్రామంలో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా ఓల్లి పాపయమ్మ ప్రచారం కొనసాగించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ నీ గెలిపిస్తే గ్రామాల్లోని అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు శనివారం సాయంత్రం వైసీపీ సీనియర్ నాయకులు కే . పైడిపు నాయుడు కడగల స్వామి నాయుడు బొత్స కృష్ణ నాయ కులతో కలిసి మదుపా డ లింగాలవలస గ్రా మాల్లో ప్రచార నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదు పాయాలు రోడ్లు డ్రైనేజీ వ్యవసాయం విద్య ఉపాధి మహిళా సంక్షేమం తదితర సమస్య లపై దృష్టి పెట్టి గ్రామాల్లో సమస్యలు పరిష్క రిస్తామని అన్నారు వైసిపి నాయకులు. పైడిపు



నాయుడు కడగల.స్వామి నాయుడు సహకారంతో వైసిపి సమన్వయకర్త బొత్స అప్పల నరసయ్య ఆశీస్సులతో గ్రామాలను అభివృద్ధి చేయడానికి నా వంతు కృషి చేస్తామని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

పొగాకు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి
- 60 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి



ఉదయం ప్రతినిధి - పార్వతీపురం

పొగాకు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రజలు ముఖ్యంగా యువత పొగాకు ఉత్పత్తుల వినియోగానికి దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి, అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా జిల్లావ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రత్యేకంగా 60 రోజుల పాటు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. పొగాకు వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పించాలని, పొగాకుకు దూరంగా ఉండేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా యువత ప్రపంచం 4.0 గోడపత్రికను కూడా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఓం విజయలక్ష్మి, కార్యక్రమ నోడల్ అధికారి ఎన్‌సీడీ పీఓ డా. టి. జగన్ మోహనరావు, ప్రోగ్రాం అధి కారులు డా. వై. విజయమోహన్, డా. ఎం. రవికుమార్ రెడ్డి, డా. కౌశిక్, ఎన్‌టీసీపీ సోషల్ వర్కర్ కె. భవాని, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం కౌన్సిలర్ కె. కృష్ణారావు, డెమో ప్రసాద్, గిరిబాబు తదితరులు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్‌పై ఎగుమతి సుంకం రద్దు.. కేంద్రం కీలక నిర్ణయం

ఉదయం ప్రతినిధి - న్యూఢిల్లీ

ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొన్న పరిస్థితుల్లో.. ఇంధన ఎగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ ఎగుమతులపై విధించే స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీని రద్దు చేసింది. ఈ మేరకు శనివారం ఆర్థిక శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అయితే డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై మాత్రం ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం పెంచింది. లీటర్ డీజిల్‌పై విధించే ఎగుమతుల సుంకాన్ని రూ.11.5కు పెంచగా.. లీటర్ ఏటీఎఫ్‌పై రూ.11కు పెంచింది. తాను జారీ చేసిన ఈ ఆదేశాలు తక్షణమే (అంటే అక్టోబర్ 31 నుంచి) అమలవుతున్నట్టు కేంద్రం ప్రకటించింది. గతంలో లీటర్ పెట్రోల్‌పై ఎగుమతి సుంకం రూ.2.5 ఉండగా.. ఇప్పుడు దీన్ని కేంద్రం రద్దు చేసింది. లీటర్ డీజిల్‌పై ఎగుమతి సుంకం రూ.8.5 ఉంటే.. ప్రస్తుతం రూ.11.5కు పెంచింది. అంటే ఈ సుంకం మూడు రూపాయలు పెరిగింది. అలాగే ఏటీఎఫ్‌పై రూ.10.5గా ఉన్న ఎక్సైజ్ డ్యూటీ రూ.11కు పెరిగింది. భారత్‌లో తయారు చేసి ఇతర దేశాలకు పంపించే డీజిల్,ఏటీఎఫ్‌పై ఈ ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా చమురు సంక్షోభం ఏర్పడిన విషయం తెలిసిందే.

తరగతి గదిలోకి చొరబడి బాలికపై కిరాతక దాడి

- కళ్లెదుటే ఘోరం.. భయంతో వణికిపోయిన విద్యార్థులు
- సంచలన విషయాలు వెల్లడించిన ప్రత్యక్ష సాక్షి క్లాస్ టీచర్!



ఉదయం ప్రతినిధి - అనంతపురం

అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన కిరాతక దాడి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. పాఠాలు నేర్చుకుంటూ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న చిన్నారిపై ఓ యువకుడు విద్యుత్‌తో పనిచేసే రంపంతో దాడికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. తరగతి గదిలోనే జరిగిన ఈ దారుణ ఘటనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న తరగతి ఉపాధ్యాయురాలు రాజేశ్వరి వెల్లడించిన వివరాలు ఇప్పుడు అందరినీ కలచివేస్తున్నాయి. శనివారం ఉదయం పాఠశాలలో యథావిధిగా తరగతులు కొనసాగుతున్న సమయంలో ఈ దారుణం చోటుచేసుకుంది. రెండో పీరియడ్‌లో ఉపాధ్యాయురాలు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులంతా తరగతి గదిలో కూర్చొని పాఠాలు వింటున్నారు. అదే సమయంలో ఓ యువకుడు చేతిలో విద్యుత్ రంపం పట్టుకుని తరగతి గదిలోకి ప్రవేశించాడు. పాఠశాల ఆవరణలో మరమ్మతులు, ఇతర పనులు జరుగుతుండటంతో తొలుత అతడిని పనుల నిమిత్తం వచ్చిన వ్యక్తిగా భావించినట్లు ఉపాధ్యాయురాలు వివరించారు. అయితే క్షణాల్లోనే పరిస్థితి భయానకంగా మారిపోయింది. చేతిలో ఉన్న యంత్రాన్ని ఆన్ చేసుకుని తరగతి గదిలోకి వచ్చిన యువకుడు నేరుగా మొదటి వరుసలో కూర్చున్న బాలిక వద్దకు వెళ్లి దాడికి పాల్పడ్డాడు. ఏం జరుగుతుందో అర్థం చేసుకునేలోపే దాడి జరిగిపోయిందని ఉపాధ్యాయురాలు ఆవేదన వ్యక్తం చేశారు. యంత్రం శబ్దం వినిపించినప్పటికీ తొలుత అది ఏమిటో గుర్తించలేకపోయామని, పాఠశాలలో పనులు జరుగుతున్న నేపథ్యంలో ఏదైనా పని చేసేందుకు వచ్చిన వ్యక్తి అయి ఉంటాడని భావించామని తెలిపారు. దాడి ఒక్కసారిగా జరగడంతో తరగతి గదిలోని విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొందరు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. మరికొందరు ఏం చేయాలో తెలియక నిశ్చేష్టులుగా ఉండిపోయారు. బాలికపై దాడిని చూసిన ఉపాధ్యాయురాలు సైతం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తేరుకుని ఏదైనా చర్య తీసుకునేలోపే ఘోరం జరిగిపోయిందని కన్నీటిపర్యంతమయ్యారు. బాధిత బాలికను కాపాడేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని లక్ష్మిపై కూడా నిందితుడు దాడి చేసినట్లు ఉపాధ్యాయురాలు వెల్లడించారు. ఈ దాడిలో లక్ష్మి కాలికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ప్రధాన బాధితురాలు రక్తపు మడుగులో కుప్పకూలడంతో తరగతి గదిలో భయానక వాతావరణం నెలకొంది. ఎన్నికల విధుల కారణంగా పలువురు ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో కొద్దిమంది సిబ్బందే పాఠశాలలో ఉన్నారు.దాడి అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే పాఠశాలకు చేరుకుని వివరాలు సేకరించారు. తీవ్రంగా గాయపడిన బాలికలను అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రధాన బాధితురాలికి ముఖం, మెడ, వీపు తదితర ప్రాంతాల్లో తీవ్ర గాయాలైనట్లు వైద్య వర్గాల సమాచారం.

గోశాడలో టీడీపీలోకి భారీగా చేరికలు



మాజీ సర్పంచ్ బోగురోతు శ్రీనివాసరావుతో పాటు 60 కుటుంబాల చేరిక

ఉదయం ప్రతినిధి - గుర్ల

గుర్ల మండలం గోశాడ గ్రామంలో తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి గ్రామ మాజీ సర్పంచ్ బోగురోతు శ్రీనివాసరావుతో పాటు సుమారు 60 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు వారికి పార్టీ కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ చేరికలతో గోశాడ గ్రామంలో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. గ్రామంలో పార్టీ మరింత బలోపేతం కానుందని స్థానిక టీడీపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉత్కంఠభరితంగా విజయవాడ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక



ఉదయం ప్రతినిధి - విజయవాడ

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు కేంద్రబిందువైన విజయవాడ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతోంది. అధికార ఎన్డీయే కూటమి ఉమ్మడి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ బరిలో నిలవగా, ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్సీపీ తరఫున మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మరోసారి పోటీ పడుతున్నారు. అయితే, ఈ ద్విముఖ పోరును అనూహ్యంగా త్రిముఖ సమరంగా మారుస్తూ మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా రంగానికి దిగడం బెజవాడ రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. వామపక్షాలు , కాంగ్రెస్ పార్టీల ఐక్య మద్దతుతో ఆయన నిర్వహిస్తున్న ప్రచారం సాంప్రదాయ రాజకీయ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.మాజీ సీపీగా బెజవాడ నగరంపై పరిపూర్ణమైన పట్టు, శాంతిభద్రతలపై స్పష్టమైన అవగాహన ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు తన ప్రచారాన్ని ప్రత్యేక శైలిలో నిర్వహిస్తున్నారు. అవినీతి రహిత నగర పాలన, పన్నుల భారం తగ్గించడం, లంచాలు లేని సేవలు అనే నినాదాలతో మేధావులు, మధ్యతరగతి , విద్యాధికుల ఓటు బ్యాంక్‌ను ఆకర్షించేందుకు ఆయన తీవ్రంగా శ్రమిస్తున్నారు. వామపక్ష బలానికి తోడు కాంగ్రెస్ పార్టీ మద్దతు లభించడం, అలాగే సీనియర్ ఐపీఎస్‌గా ఆయనకున్న నిష్కళంకమైన ఇమేజ్ ఏబీవీకి ప్రధాన బలంగా మారాయి. ఏ రాజకీయ పార్టీ బంధాలు లేకుండా, కేవలం విజయవాడ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఆయన విసురుతున్న సవాళ్లు ప్రధాన పార్టీల అభ్యర్థులకు మింగుడుపడటం లేదు.అయితే, ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న వంగవీటి రాధాకృష్ణకు బలమైన ప్రజాదరణ, వంగవీటి కుటుంబానికి నగరంలో ఉన్న అభిమానుల బలగం పెద్ద ప్లస్ పాయింట్. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. రాధాకృష్ణ, ఏబీ వెంకటేశ్వరరావు ఇద్దరూ ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా అత్యంత హుందాతనంతో ప్రచారం సాగిస్తుండటం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలిచింది. రాధా సైతం నగరాభివృద్ధికి ఏబీవీ సలహాలు తీసుకుంటా అని ప్రకటించగా, ఏబీవీ కూడా మాది భావజాల పోరాటమే తప్ప వ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు.మరోవైపు వైఎస్సార్సీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మి బిసి సామాజిక వర్గ సమీకరణాలు, తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులనే నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. అయితే, ఓట్ల చీలిక ఎవరికి లాభిస్తుందనేది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. నాన్-పొలిటికల్, న్యూట్రల్ ఓటర్లు, మార్పు కోరుకునే వర్గాలు గనక ఏబీవీ వైపు మొగ్గుపడితే కూటమి, వైసీపీ ఓట్ బ్యాంకుల్లో భారీగా గండిపడే అవకాశం ఉంది. బెజవాడ ఓటర్లు ఎప్పుడూ ఊహించని సంచలన తీర్పులకు వేదికగా నిలుస్తారనే చరిత్ర ఉండటంతో, ఏబీవీ గెలుపు అవకాశాలను రాజకీయ విశ్లేషకులు తోసిపుచ్చలేకపోతున్నారు. వంగవీటి రాధా పవర్ కేడర్, రాయన భాగ్యలక్ష్మి పార్టీ క్యాడర్ బలానికి ఎదురీదుతూ ఏబీ వెంకటేశ్వరరావు సృష్టిస్తున్న ఈ ట్రెండ్ బెజవాడ రాజకీయాల్లో కొత్త చరిత్రకు పునాది వేస్తోంది. సంప్రదాయ పార్టీల ధనప్రవాహం, కుల సమీకరణలను దాటుకుని, వామపక్షాల సంపూర్ణ సహకారంతో ఏబీవీ నిజంగానే బెజవాడ పీఠంపై సంచలనం సృష్టిస్తారా లేక కూటమి-వైసీపీల హోరాహోరీ మధ్య స్వతంత్ర హోదాకే పరిమితమవుతారా అనేది పోలింగ్ ఫలితాలు తేల్చనున్నాయి.

రాఘవేంద్రరావు మరదలు, జగపతిబాబు చెల్లెలు

మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ


ఉదయం ప్రతినిధి - గుంటూరు



గుంటూరు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ కుటుంబ నేపథ్యంపై ఆసక్తికర సమాచారం వెలుగుచూసింది. ఆమె విజయాన్ని కాంక్షిస్తూ ఇద్దరు సినీ ప్రముఖులు వీడియో సందేశాలు విడుదల చేశారు. ఆ ఇద్దరూ లక్ష్మీ అపర్ణకు దగ్గర బంధువులుగా చెబుతున్నారు. లక్ష్మీ అపర్ణను గుంటూరు మేయరుగా గెలిపించాలని దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, ప్రముఖ హీరో జగపతిబాబు ప్రత్యేకంగా వీడియోలు విడుదల చేశారు. రాఘవేంద్రరావు, మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ భర్త కోవెలమూడి రవీంద్ర సోదరులుగా చెబుతున్నారు. అదేవిధంగా లక్ష్మీ అపర్ణ తనకు సోదరి అంటూ స్వయంగా జగపతిబాబు వెల్లడించారు. గుంటూరు టీడీపీ నేత, మాజీ మేయర్ రవీంద్ర అలియాస్ నాని రాజకీయాల్లో చాలా సీనియర్. అయినప్పటికీ ఆయన బంధుత్వంపై గుంటూరు వాసులకు తప్ప రాష్ట్రంలో ఇతర ప్రాంతాల వారికి తెలియదు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల పోరులో రవీంద్ర కుటుంబం దిగడంతో ఆయన బంధువులు బయటకు వస్తున్నారు. కోవెలమూడి లక్ష్మీ అపర్ణను గెలిపించాలని కోరుతున్నారు. ఇందులో సినీ ప్రముఖులు అయిన రాఘవేంద్రరావు, జగపతిబాబు విడుదల చేసిన వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయి గుంటూరు ప్రజలకు విన్నపం నా చెల్లి లక్ష్మీ అపర్ణ మేయరుగా పోటీ చేస్తున్నారని జగపతిబాబు విడుదల చేసిన వీడియో ఆకట్టుకుంటోందని చెబుతున్నారు. ప్రజలు చాలా తెలివైన వారని, ఎవరిని గెలిపించాలో వారికి బాగా తెలుసు అన్న జగపతిబాబు గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించినట్లుగానే లక్ష్మీ అపర్ణను గెలిపించాలని కోరారు. నా చెల్లికి మంచి మనసు ఉంది. సమర్థురాలు అంటూ ఆయన కితాబునిచ్చారు. ఇక జగపతిబాబు చెల్లెలుగా లక్ష్మీ అపర్ణను పరిచయం చేయడంతో వారి మధ్య బంధుత్వంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.ప్రముఖ నిర్మాత వీబీ రాజేంద్రప్రసాద్ కుమారుడైన జగపతిబాబుకు ఇద్దరు సోదరులు మాత్రమే ఉన్నారని సమాచారం. అయితే లక్ష్మీ అపర్ణ కుటుంబంతో దగ్గర సంబంధం ఉండటం, బంధుత్వం కారణంగా ఆమె సోదరి అవుతారని అంటున్నారు. మొత్తానికి గుంటూరు మేయరు అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు మద్దతుగా సినీ ప్రముఖులతోపాటు పారిశ్రామిక, వ్యాపార దిగ్గజాలు సైతం బయటకు వస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని అంటున్నారు. శుక్రవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియగా, సినీ ప్రముఖులు విడుదల చేసిన వీడియోలు మాత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో గుంటూరు కూటమి మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణకు డిజటల్ ప్రచారం బాగా జరుగుతోందని విశ్లేషిస్తున్నారు.

సరికొత్త రాజకీయ దుమారాన్ని రేపుతోన్న బెంగళూరు ప్యాలెస్ రగడ

ఉదయం ప్రతినిధి - కడప



తెలుగు రాష్ట్రాల రాజకీయంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన వైఎస్సార్ కుటుంబంలో ఆస్తుల తగాదాలు ఇప్పుడు చౌరస్తాకు వచ్చాయి. వైఎస్ కుటుంబంలో ఇప్పటికే సరస్వతి పవర్ షేర్లతో పాటు పలు ఆస్తుల వ్యవహారాలు ఎన్‌సిఎల్‌టి కోర్టు మెట్లు ఎక్కగా, తాజాగా బెంగళూరులోని యలహంక ప్యాలెస్ వివాదం సరికొత్త రాజకీయ దుమారాన్ని రేపుతోంది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య సాగుతున్న ఈ శత్రుత్వంలో.. వైఎస్సార్ కూతురు షర్మిల తన కుమార్తె అంజలి వివాహ వేడుకను యలహంక ప్యాలెస్‌లో నిర్వహించాలని భావించడం, దానికి జగన్ భద్రతా కారణాలు చెబుతూ అనుమతించకపోవడం రాజకీయ వర్గాల్లో విస్తుపోయేలా చేస్తోంది.ఈ బెంగళూరు ప్యాలెస్ కేవలం ఒక విలాసవంతమైన భవనం మాత్రమే కాదు, వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే కుటుంబం కోసం నిర్మించిన ఆస్తి. గతం నుండి షర్మిల ఇక్కడ సుదీర్ఘకాలం నివాసముండటంతో పాటు, కుటుంబ అవసరాలకు ఇది నిలయంగా మారింది. అందుకే తన కూతురు వివాహ శుభలేఖలలో కూడా షర్మిల వివాహ వేదికగా యలహంక ప్యాలెస్‌ను ముద్రించి ఆహ్వానాలు కూడా పంచారు. అయితే, నా ఇంట్లోకి వివాహ కేటరింగ్, ఈవెంట్ మేనేజర్లు, ఫోటోగ్రాఫర్లు రావడం వల్ల నా భద్రతకు, ప్రైవసీకి తీవ్ర ముప్పు ఏర్పడుతుంది అంటూ జగన్ లేఖ రాయడం, హైదరాబాద్ లోటస్ పాండ్‌ను వాడుకోవాలని సూచించడంపై షర్మిల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ తండ్రి వైఎస్సార్ కట్టించిన ఆస్తిలో తనకూ సమాన హక్కు ఉందని ఆమె వర్గం సెంటిమెంట్ అస్త్రాన్ని బలంగా ప్రయోగిస్తోంది.ఈ వివాదంలో సామాజికంగా, రాజకీయంగా లభిస్తున్న ప్రజాభిప్రాయాన్ని గమనిస్తే, సానుభూతి పవనాలు పూర్తిగా షర్మిల వైపే వీస్తున్నాయి. ఎంత రాజకీయం ఉన్నా, కన్న చెల్లెలి కూతురు పెళ్లికి.. అదీ సొంత మేనకోడలి కళ్యాణానికి ప్యాలెస్‌ను తిరస్కరించడం ఏ రకమైన సంస్కృతి అని నెటిజన్లు, ప్రజలు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ఏపీలోని ప్రత్యర్థి పార్టీలు ఎన్డీయే, టీడీపీ నేతలు కూడా జగన్ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. సొంత చెల్లెలికి, మేనకోడలికి న్యాయం చేయలేని నాయకుడు ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు? అంటూ చంద్రబాబు, నారా లోకేష్ విమర్శలు గుప్పిస్తుండటం వైఎస్సార్సీపీని తీవ్ర ఇరకాటంలో పడేసింది.ఇక పొలిటికల్ ఇమేజ్ పరంగా చూస్తే జగన్ మోహన్ రెడ్డికి ఈ ఘటన వల్ల జరిగే నష్టం అంతా ఇంతా కాదు. 2024 ఎన్నికల ఘోర పరాజయం తర్వాత వైఎస్సార్సీపీ మళ్లీ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, ఇటువంటి పర్సనల్ ఇష్యూస్ జగన్ ప్రజాదరణను మరింత దిగజారుస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబ సభ్యులు, వైఎస్ విజయమ్మ కూడా షర్మిల పక్షాన నిలబడటంతో.. జగన్ వద్ద పనిచేస్తున్న రాజకీయ సలహాదారులు, కోటరీ ఆయనకు సరైన సలహాలు ఇవ్వడంలో ఘోరంగా విఫలమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాంకేతిక, చట్టపరమైన, ప్రైవసీ సాకులు చెప్పి మేనకోడలి పెళ్లిని నిరోధించడం కంటే, పెద్ద మనసుతో వేడుకకు అనుమతిస్తే రాజకీయంగా పాయింట్లు స్కోర్ చేసే అవకాశం ఉండేదన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.జగన్ వైఖరి వెనుక ఉన్న పట్టుదల లేదా మంకుపట్టుదల ఆయనను రోజురోజుకూ జనాల్లో ప్రతికూల నాయకుడిగా నిలబెడుతోంది. నేను చెప్పిందే వేదం, నా మాటే శాసనం అనే దోరణి రాజకీయంలోనైనా, కుటుంబంలోనైనా దెబ్బతీస్తుందనేది ఈ ఉదంతం నిరూపిస్తోంది. ఒకవేళ భద్రతే కారణమైతే పగడ్బందీ సెక్యూరిటీ అరెంజ్‌మెంట్స్ చేసుకుని పెళ్లి జరిపించే అవకాశాలు ఉన్నప్పటికీ.. అంతగా భీష్మించుకుని కూర్చోవడం వల్ల వైఎస్సార్ అభిమానుల్లో సైతం జగన్ పట్ల తీవ్ర నైతిక అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ బెంగళూరు ప్యాలెస్ వివాదం కేవలం ఒక ఇల్లు లేదా కళ్యాణ వేదికకు పరిమితమైన సమస్య కాదు. వైఎస్ కుటుంబంలో ఏర్పడిన ఆస్తులు, రాజకీయ వారసత్వ పోరు క్లైమాక్స్‌కు చేరిందనడానికి ఇది స్పష్టమైన సంకేతం. సలహాదారుల లోపమో లేక సొంత పట్టుదలో కానీ, ఈ వివాదంలో జగన్ తన ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేసుకుంటుంటే.. షర్మిల మాత్రం బాధితురాలిగా ప్రజా సానుభూతిని కూడగట్టుకోవడంలో ముందంజలో ఉన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఆస్తుల రగడ కోర్టుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో, వైఎస్సార్సీపీపై ఎలాంటి రాజకీయ ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

ఫుట్‌పాత్‌పై బైక్ నడిపితే రూ.5 వేలు

- వన్‌వేలో వెళ్తే రూ.10 వేల ఫైన్
- బెంగళూరులో కఠినంగా ట్రాఫిక్ రూల్స్

ఉదయం ప్రతినిధి - బెంగళూరు



బెంగళూరులో ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినతరం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. సగం హెల్మెట్ ధరించే వాళ్లపై ఫైన్లు వేయడంతో పాటు వాటిని అమ్ముతున్న వారిపై, తయారీదారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధం అవుతున్నది. అలాగే ఫుట్‌పాత్‌లపై బైకులు నడిపితే రూ.500 ఉన్న ఫైన్‌ను రూ.5వేలకు పెంచనున్నారు. వన్‌వేపై వెళ్తే వేసే వెయ్యి జరిమానాను రూ.10వేలకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ మేరకు రాష్ట్ర రవాణా, హోం శాఖలు సమర్పించిన ప్రతిపాదనలపై ప్రభుత్వం పరిశీలన జరుపుతున్నది.బుధవారం విధానసౌధలో హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే, రవాణా మంత్రి బి. సురేశ్ ఉన్నతాధికారులతో సంయుక్త సమీక్ష నిర్వహించారు. బెంగళూరులో ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, రోడ్డు భద్రతను మెరుగుపరచడం, పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంపై చర్చించారు. ఫుట్‌పాత్‌లపై వాహనాల నడపడం, వన్‌వే ఉల్లంఘనలు, అక్రమ పార్కింగ్, నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల నిలుపుదల, సిగ్నల్ ఉల్లంఘనలపై జరిమానాలు పెంచే ప్రతిపాదనలూ సమావేశంలో చర్చకు వచ్చాయి. ప్రస్తుతం ఫుట్‌పాత్‌పై ద్విచక్ర వాహనం నడిపితే విధిస్తున్న రూ.500 జరిమానాను మొదటిసారి ఉల్లంఘనకు రూ.5,000కు, రెండోసారి ఉల్లంఘిస్తే రూ.10,000కు పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. వన్‌వే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ప్రస్తుతం ఈ ఉల్లంఘనకు రూ.1,000 జరిమానా ఉండగా.. దాన్ని పదిరెట్లు పెంచి రూ.10,000కు చేర్చాలని ప్రతిపాదించింది. రవాణా, హోం శాఖలు ఈ మేరకు ప్రతిపాదనలు సమర్పించాయి. న్యాయశాఖ అభిప్రాయం తీసుకున్న తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నది. పదేపదే ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు పాయింట్ల ఆధారిత డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని తీసుకురావడంపైనా అధికారులు చర్చించారు. వివిధ రకాల ఉల్లంఘనలకు నిర్దిష్ట పాయింట్లు కేటాయిస్తారు. ఒక డ్రైవర్ నిర్దేశిత పరిమితికి చేరుకుంటే అతడి డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసే అవకాశం ఉంటుంది. ఈ విధానం అమలుకు అవసరమైన చట్టపరమైన అంశాలపైనా సమీక్షించారు. రవాణా శాఖకు చెందిన సారథి వ్యవస్థను బెంగళూరు ట్రాఫిక్ పోలీసుల ఈ-చలాన్ వ్యవస్థతో అనుసంధానించే అంశాన్ని కూడా పరిశీలించారు. దీనివల్ల వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటును పోలీసులు అక్కడికక్కడే తనిఖీ చేయగలుగుతారు. గతంలో చేసిన ట్రాఫిక్ ఉల్లంఘనల వివరాలనూ తెలుసుకోవచ్చు. కొత్తగా నమోదయ్యే ఉల్లంఘనలను నేరుగా డ్రైవర్ డిజిటల్ రికార్డుకు అనుసంధానించవచ్చు.

నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి జీఎస్ఎల్వీ-ఎఫ్18

ఉదయం ప్రతినిధి - శ్రీహరికోట



భారత అంతరిక్ష సంస్థ ఇస్రో ఒక భారీ రాకెట్‌ను ప్రయోగించి విజయవంతమైంది. జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్, 2026 అక్టోబర్ 30వ తేదీన రాత్రి 11:51 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ఎన్వీఎస్-03 అనే నావిగేషన్ ఉపగ్రహాన్ని మోసుకెళ్లింది. ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.ఈ ఉపగ్రహం భారతదేశపు నావిక్ వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది. జీఎస్ఎల్వీ రాకెట్ తన 20వ ప్రయోగం. ఈ రాకెట్ ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం రెండవ లాంచ్ ప్యాడ్ నుండి ప్రవేశపెట్టిన ఇస్రో.. మూడు దశల్లో ప్రవేశపెట్టి సక్సెస్ చేసింది. దీంతో ఇస్రోలో శాస్త్రవేత్తలు సంబరాలు చేసుకున్నారు. జిఎం-03 2232 బరువుగల శాటిలైట్ ను నింగిలోకి మోసుకెళ్లింది. భారత్ సొంతంగా తయారు చేసుకున్న నావిగేషన్ వ్యవస్థను బలోపేతానికి జిఎం-03ని ప్రయోగించింది. ఈ ఉపగ్రహం13 ఏళ్ల పాటు కక్షలో పని చేయనుంది.జిఎం-03 అనేది రెండవ తరం నావిక్ ఉపగ్రహాలలో మూడవది. దీనికి స్వదేశీంగా తయారు చేసిన అటామిక్ క్లాక్, కొనుగోలు చేసిన అటామిక్ క్లాక్‌ను అమర్చారు. మునుపటి ఉపగ్రహాలలో ఒక్ , ా సిగ్నల్స్ ఉండేవి. ఇప్పుడు కొత్తగా ఒ1 సిగ్నల్‌ను జోడించారు. ఇది నావిగేషన్‌ను మరింత మెరుగుపరుస్తుంది. ఈ ఉపగ్రహం భారతదేశ భూభాగం, దాని చుట్టూ 1,500 కిలోమీటర్ల వరకు ఉన్న ప్రాంతానికి కచ్చితమైన ప్రదేశం, వేగం, సమయ సమాచారాన్ని అందిస్తుంది.నావిక్ అనేది భారతదేశపు సొంత నావిగేషన్ వ్యవస్థ. ఇది రెండు రకాల సేవలను అందిస్తుంది. ఒకటి సాధారణ ప్రజల కోసం ఉద్దేశించిన 'స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్', మరొకటి ప్రత్యేక ప్రయోజనాల కోసం ఉద్దేశించిన 'రెస్ట్రిక్టెడ్ సర్వీస్'.ఇస్రో మొత్తం ఐదు సెకండ్ జనరేషన్ ఉపగ్రహాలను నిర్మించాలని యోచిస్తోంది. ఇస్రో 2023 మే 29న జీఎస్ఎల్వి-ఎఫ్12 రాకెట్ ద్వారా ఎన్విఎస్-01ను అంతరిక్షంలోకి ప్రయోగించింది. ఇది మొట్టమొదటి స్వదేశీ అణు గడియారాన్ని మోసుకెళ్లింది. ఇప్పుడు ఈ రోజు ప్రయోగించిన కొత్త ఉపగ్రహం ఎన్విఎస్-03, ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్తుంది. ఈ వ్యవస్థ వాహన నావిగేషన్, లొకేషన్ సేవలు, ఇతర ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. ఇది ఒకప్పుడు ఇతర దేశాల వ్యవస్థలపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. అందువల్ల ఈ రాత్రి జరిగే ఇస్రో ఉపగ్రహ ప్రయోగం దేశానికి చాలా కీలకం.

రాజకీయాల్లో బంధువులు.. వేర్వేరు పార్టీల్లో కుటుంబసభ్యులు

ఉదయం ప్రతినిధి - విజయవాడ

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమరం రక్త సంబంధీకులు, బంధువుల మధ్య హోరాహోరీ పోరుగా రూపాంతరం చెందింది. రాజకీయ సమీకరణాలు, రిజర్వేషన్ల కేటాయింపుల పుణ్యమాని ఒకే కుటుంబానికి చెందిన వారు వేర్వేరు జెండాలు పట్టుకుని ఒకరిపై ఒకరు పోటీకి సిద్ధమవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఎన్నికల వేళ పల్లెల్లో నెలకొన్న ఈ విచిత్రమైన వాతావరణం ఓటర్లతో పాటు స్థానికంగా హాట్ టాపిక్ అవుతోంది. మహిళా రిజర్వేషన్ అయిన చోట భార్యాభర్తలు కలిసి పోటీ చేస్తుంటే, మరికొన్ని చోట్ల ఒకే కుటుంబం నుంచి ఒకే స్థానానికి పోటీపడుతూ పదవి తమ గుమ్మం దాటకుండా చూపుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి స్థానాలు పదుల సంఖ్యలో ఉన్నట్లు చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలోని కలివరం ఎంపీటీసీ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన తోడికోడళ్లు బుద్దేపు లక్ష్మి (తెలుగుదేశం పార్టీ), బుద్దేపు కూరమ్మ (వైఎస్సార్సీపీ) నామినేషన్లు దాఖలు చేశారు. ఒకప్పుడు ఇదే స్థానం కోసం అన్నదమ్ములు తలపడగా, ఇప్పుడు మహిళలకు రిజర్వు చేయడంతో తమ భార్యలను రణరంగంలోకి దించారని చెబుతున్నారు. ఇదే రీతిలో నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలోని మొగళ్లూరు ఎంపీటీసీ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. ఈ స్థానం కోసం తోడికోడళ్లు అయిన కూకట్ల శంకరమ్మ (టీడీపీ), కూకట్ల ఉష (వైఎస్సార్సీపీ) సర్వశక్తులు ఒడ్డుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డులు ఎంపీటీసీ స్థానాల విభజన తీరు కుటుంబాల మధ్య రాజకీయ విభేదాలకు ఆజ్యం పోసింది. ఉమ్మడి కుటుంబాల్లో కలిసిమెలిసి ఉండే సొంత అన్నదమ్ములు, బావబావమరుదులు సైతం వేర్వేరు పార్టీల కండువాలు కప్పుకుని బరిలో నిలుస్తున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు ఎవరి పార్టీ వ్యూహాల్లో వారు బిజీగా ఉంటూ, బహిరంగ ప్రచారంలో ఒకరిపై ఒకరు విమర్శలు సంధించుకుంటున్న దృశ్యాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇక కాకినాడ జిల్లా రౌతులపూడిలో అయితే ఒకే కుటుంబం నుంచి భార్యాభర్తలు పైలా అశోక్, సౌజన్యలు వేర్వేరు ఎంపీటీసీ స్థానాల నుంచి టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తుండగా, అదే కుటుంబానికి చెందిన లోవ కళ్యాణి (సౌజన్య ఆడపడుచు వరుస) జెడ్పీటీసీ స్థానానికి బరిలో నిలిచి వినూత్న రాజకీయం నడిపిస్తున్నారు. మరోవైపు ఉమ్మడి గోదావరి జిల్లాలోని కడియం మండలంలో ఎంపీపీ పోరు రాజకీయంగా పీక్స్‌కి చేరింది. ఇక్కడ ఎంపీపీ పదవి జనరల్ మహిళకు కేటాయించడంతో ప్రముఖ నర్సరీ రైతులు తమ సకుటుంబంగా ఎన్నికల బరిలోకి దిగారు. కూటమి తరఫున బోడపాటి గోపాలకృష్ణ భార్య పుణ్యవతి, వైసీపీ తరఫున తాడాల విష్ణు చక్రవర్తి భార్య రాజరాజేశ్వరి ఈ పదవి కోసం పోటీపడుతున్నారు. కేవలం భార్యలే కాకుండా, ఆ భర్తలు కూడా వేర్వేరు ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేస్తుండటంతో ఈ కడియపులంక రాజకీయం రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. గ్రామాల్లో సొంత వాళ్ల పంచాయితీ నడుస్తుండటంతో ఓటర్లు డైలమాలో పడుతున్నారని చెబుతున్నారు. బంధుత్వానికి పెద్దపీఠ వేసి ఎవరికో ఒకరికి ఓటేయాలా? లేక తాము నమ్మిన పార్టీ సిద్ధాంతాలు, అభ్యర్థుల సమర్థతను బట్టి తీర్పునివ్వాలా? అని తేల్చుకోలేక తలలు పట్టుకుంటున్నారని అంటున్నారు. ఎన్నికల పోరు ముగిసి, ఫలితాలు వెలువడిన తర్వాత గెలుపు ఓటముల ప్రభావం ఈ కుటుంబాల బాంధవ్యాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం అవసరం

ఎఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్



ఉదయం ప్రతినిధి - పార్వతీపురం

ఎఐటీయుసి 106 సంవత్సరాలు పూర్తి చేసుకుని 107వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ శనివారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కుల విధ్వంసానికి వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణతో పోరాటాలు నిర్మించాల్సిన చారిత్రక బాధ్యత కార్మిక సంఘాలపై ఉందన్నారు. ప్రస్తుతం పాలకులు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసి, యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛ కల్పించేలా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చారని విమర్శించారు. వీటి వల్ల కార్మికులు ఆధునిక బానిసత్వంలోకి నెట్టబడే ప్రమాదం ఉందన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు అండగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఆటో, హమాలీ, మున్సిపల్, వీధి వ్యాపారుల సంక్షేమ బోర్డుల ఏర్పాటు కోసం ఎఐటీయుసి నిరంతరం పోరాడుతోందని తెలిపారు. రానున్న 43వ జాతీయ మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతి కార్మికుడు పోరాట నిధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు సింహాద్రి దుర్గారావు, హమాలీ జిల్లా అధ్యక్షుడు రాగోలు దుర్గాప్రసాదరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈ.వి. నాయుడు, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తాను

ఉదయం ప్రతినిధి - గజపతినగరం



మండలంలోని జిన్నాశీ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానని జిన్నాశీ గ్రామశీ వైసిపి ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండల అనురాధ అన్నారు గ్రామంలో ప్రచారశీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతులు రోడ్లు. సంక్షేమం. విద్య. ఉపాధి వ్యవసాయం .మహిళా సంక్షేమశీ. తదితర సమస్యలపై దృష్టి పెడతామని ఆమె అన్నారు గ్రామంలోని ఏ సమస్య వచ్చిన తన భర్త మండల రమణ సహకారంతో వైసీపీ సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఆమె అన్నారు. గ్రామ పరిధిలోని జిన్నాశీ. రామన్నపేట . మల్లు నాయుడుపేట గ్రామాల్లో ఆమె సుడిగాలి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు ప్రజలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

2,202 మంది పోలీసులతో భారీ బందోబస్తు

ఉదయం ప్రతినిధి - తిరుపతి



తిరుపతి జిల్లాలో నవంబర్ 1న జరగనున్న ఐదు మున్సిపాలిటీల ఎన్నికలకు 2,202 మంది పోలీసులతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. ఓటర్లకు విజ్ఞప్తి: ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. భద్రతా సిబ్బంది వివరాలు: తిరుపతి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి మున్సిపాలిటీల పరిధిలో 8 మంది డిఎస్పీలులు, 26 మంది సిఐలు, 98 మంది ఎస్సైలతో పాటు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందాలను మోహరించినట్లు వెల్లడించారు

ఎన్నో త్యాగాలు చేసి సుదీర్ఘ కాలం పోలీస్ శాఖకు

వెలకట్టలేని సేవలందించిన మీకు కృతజ్ఞతలు

పదవీ విరమణ పొందిన సిబ్బందిని ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ

ఉదయం ప్రతినిధి - పార్వతీపురం



పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు ఉత్తమ సేవలు అందించి ఎన్నో సమస్యలను ఎదురొడ్డి, కష్ట నష్టాలు ఓర్చి ఆరోగ్యంగా, ఆనందంగా పదవీ విరమణ చెందటం అదృష్టమని, అలా ఆనందంగా, ఆరోగ్యంగా పదవీ విరమణ చేస్తున్న మీకు పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక శుభాకాంక్షలని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 31న పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చెందిన డిసిఆర్బి జె.సత్యన్నారాయణ, బలిజిపేట పోలీస్ స్టేషన్ బి.వి.రమణని జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఘనంగా సత్కరించి, వారి సేవలను కొనియాడి శాలువా, పూలదండలతో సత్కరించి, జ్ఞాపికలను వారికి అందజేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశి ఆత్మీయ వీడ్కోలు పలికారు. అదే విధంగా జిల్లా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరుపున జిల్లా ఎస్పీ బహుమతిని, చెక్కు అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ.... దాదాపు 36 సంవత్సరాలు పైగా సుదీర్ఘ సేవలు పోలీస్ శాఖలకు అందించారని , మీ కుటుంబ సహకారం బాగా ఉండటం వల్ల మీ యొక్క విధులు సమర్థవంతంగా నిర్వర్తించి, పోలీస్ శాఖ మరియు మీ కుటుంబానికి మంచి పేరు తీసుకొచ్చారని అభినందించారు. భావి జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో తులతూగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలును జిల్లా ఎస్పీ గారు తెలియజేసినారు. పదవీ విరమణ చెందిన వారి కుటుంబ సభ్యుల వివరాలు యోగక్షేమాలు అడిగి తెలుసుకొని, పదవీ విరమణ తర్వాత కూడా మీరు పోలీసు కుటుంబం లో సభ్యులేనని, ఎలాంటి సమస్య వచ్చినా తమను సంప్రదించాలని సూచించారు. సకాలంలో రిటైర్మెంట్ బెనిఫిట్ లను అందేటట్లు అన్ని చర్యలు తీసుకుంటామనీ చెప్తూ, ఉద్యోగ విరమణ అనంతరం లభించిన ప్రతి ప్రయోజనాన్ని, ప్రతి రూపాయిని ప్రణాళిక బద్ధంగా ఖర్చుచేసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా మీరు ఆరోగ్యంగా ఉంటూ క్రియాశీలమైన ఏదో ఒక పనిని ఎంచుకొని మీ యొక్క కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని మనసారా కోరుకుంటున్నానని తెలిపారు. పదవీ విరమణ పొందిన మాట్లాడుతూ మమ్మల్ని ఘనంగా "ఆత్మీయ వీడ్కోలు" పలకడం, సత్కరించడం మా జీవితంలో ఎన్నటికీ మరువలేమని జిల్లా ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బీ సిఐ రమణమూర్తి, ఏఆర్ ఆర్ఐ లు నాయుడు, రాంబాబు, ఆదినారాయణ, సోషల్ మీడియా సిఐ మారూఫ్, డిసిఆర్బి సిఐ రమణ మరియు పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భారత ఉక్కు మహిళ ఇందిరాగాంధీ..!



ఉదయం ప్రతినిధి - పార్వతీపురం

- భారత తొలి మహిళా ప్రధానిగా ఖ్యాత
- బ్యాంకుల జాతీయకరణతో విస్తృతంగా బ్యాంకు సేవలు
- హరిత విప్లవం ద్వారా ఆహార ఉత్పత్తి
- ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

భారత రాజకీయ చరిత్రలో ఐరన్ లేడీగా పేరుగాంచి , ప్రియదర్శినిగా ప్రజల హృదయాల్లో నిలిచిన భారత తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ అని కాంగ్రెస్ పార్టీ డిసిసి పార్వతిపురం మన్యం జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు అన్నారు. శనివారం పార్వతీపురం లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు గంట మోహన్ రావు, బోను శంకరరావు, రెడ్డి వెంకటరమణ తదితరులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ పాలనలో దేశంలో కీలకమైన ఘట్టాలు చోటుచేసుకున్నాయన్నారు. భారత దేశ అత్యున్నత పౌరు పురస్కారం భారతరత్నను పొందారన్నారు. దేశ ఆర్థిక, వ్యవసాయ, పారిశ్రామిక, అంతర్జాతీయ రంగాల్లో ఆమె తీసుకున్న నిర్ణయాలు కీలకమన్నారు. పేదరిక నిర్మూలన కోసం గరీబి హటావో నినాదాన్ని ఇచ్చి ప్రధాన రాజకీయ అంశంగా ముందుకు తీసుకువచ్చారన్నారు. పేదలు రైతులు సామాన్య ప్రజల అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు. హరిత విప్లవంతో వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడ్డారన్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దేందుకు గాను అత్యవసర పరిస్థితిని విధించారన్నారు. బ్యాంకుల జాతీయకరణ తో 14 ప్రధాని బ్యాంకులను జాతీయం చేసి బ్యాంకింగ్ సేవలను విస్తృత పరిచి సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. భారతదేశంలో ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా పాలన సాగించారన్నారు. సామాన్యుడి ముందుకి చక్కని పాలన అందించారన్నారు. దేశ చరిత్రలో ఆమె పరిపాలన కాలం భారతదేశ చరిత్రలో గొప్పగా నిలిచిందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఇందిరాగాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలి అన్నారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతదేశ స్వాతంత్రం అనంతరం సంస్థానాల విలీనం ద్వారా భారత దేశానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. క్విట్ ఇండియా ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని భారతదేశానికి ఎనలేని సేవ చేశారన్నారు. ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలి : జిల్లా ఆర్.బి.ఎస్.కె పిఓ డాక్టర్ జగన్ మోహన్

ఉదయం ప్రతినిధి - కొమరాడ



ప్రజారోగ్యశీ దృష్ట్యా ఆరోగ్య కార్యక్రమాలను పక్కగా అమలు చేయాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. గుణానుపురం, విక్రశీపురం గ్రామాలను శనివారం సందర్శించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ పై ఆరా తీసి నివేదికలు పరిశీలించారు. టీకా కార్యక్రమశీ తనిఖీ చేసి యువిన్ పోర్టల్ పరిశీలించారు. ఆర్.బి.ఎస్.కె హెల్త్ స్క్రీనింగ్ వివరాలు పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎన్.సి.డి సర్వేలో గుర్తించిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలనీ ఆదేశించారు. పిల్లలో దృష్టి సమస్యలు గుర్తిస్తే జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యక్రమాల ద్వారా తగు నివారణ పొందాలన్నారు. హెల్త్ వెల్నెస్ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. మందుల లభ్యత పరిశీలించారు. వర్షాకాల అనంతర అనారోగ్య సమస్యలు తలెత్తకుండా గ్రామాల్లో ఆరోగ్య సర్వే చేయాలన్నారు. వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్ లో లార్వా సమస్యాత్మక ప్రదేశాలను పొందుపరచి, సంబంధిత శాఖల సమన్వయంతో లార్వా వేట, నివారణ చర్యలు, చేపట్టాలన్నారు. జెడ్.పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. అయోడిన్ లోపిస్తే కలిగే మానసిక, శారీరక రుగ్మతలపై అవగాహన కల్పించి నివారణకు అయోడిన్ కలిగిన ఉప్పును ఆహారంలో వినియోగించాలని తెలుపుతూ, ఉప్పులో అయోడిన్ శాతం తెలుసుకునే పరీక్ష ను అక్కడే నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎమ్ ఇంచార్జీ సిహెచ్. నాగభూషణ్, వైద్య సిబ్బంది వి. సునీత, వి. మాణిక్యం , ఆశా తదితరులు పాల్గొన్నారు.

అర్నాడలో భగ్గుమన్న 'కూటమి' విభేదాలు

టీడీపీ, జనసేన నేతల మధ్య తోపులాట!



ఉదయం ప్రతినిధి - పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం అర్నాడ గ్రామంలో అధికార కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన నాయకుల మధ్య రాజకీయ విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇరు పార్టీల కేడర్ మధ్య ప్రారంభమైన వాగ్వాదం చివరకు ఒకరినొకరు నెట్టుకునే స్థాయికి (తోపులాటకు) దారితీసింది. అర్నాడ ప్రాదేశిక నియోజకవర్గం నుంచి ఎంపీటీసీ అభ్యర్థులుగా కూటమిలోని ప్రధాన భాగస్వామ్య పక్షాలైన టీడీపీ తరఫున జోగి భుజంగరావు, జనసేన తరఫున జోగి ప్రసాధమ్మ ఇద్దరూ పట్టుబట్టి బరిలోకి దిగారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు వేర్వేరుగా గ్రామంలో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒకే సమయంలో ఇరువర్గాలు ఎదురుపడటంతో మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఇదే సమయంలో అక్కడ ప్రచారంలో పాల్గొన్న కురుపాం శాసనసభ్యురాలు (ఎమ్మెల్యే) తోయక జగదీశ్వరిని జనసేన స్థానిక నాయకులు నిలదీయడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యేను నిలదీయడంపై టీడీపీ నాయకులు జనసేన శ్రేణులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ, తోపులాట జరిగాయి. రాష్ట్రస్థాయిలో కూటమిగా ఉన్నప్పటికీ, స్థానిక ఎన్నికల బరిలో టీడీపీ, జనసేన నేతలు ప్రత్యర్థులుగా నిలవడంతో ఈ అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖ

దేశ సమైక్యతకు, సమగ్రతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయం : జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి



ఉదయం ప్రతినిధి - పార్వతీపురం

భారతదేశ ఉక్కు మనిషి, దేశ తొలి ఉప ప్రధానమంత్రి, మాజీ హోంమంత్రి స్వర్గీయ సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలను పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశ స్వాతంత్ర్య పోరాటంలో, స్వాతంత్ర్యానంతర భారతదేశ నిర్మాణంలో ఆయన అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం దేశ సమైక్యత, సమగ్రత కోసం అసాధారణమైన కృషి చేశారని పేర్కొన్నారు. తన ఉక్కు సంకల్పం, దృఢమైన నాయకత్వం, అపారమైన రాజకీయ దూరదృష్టితో 500కు పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించి, ఐక్య భారతదేశ నిర్మాణానికి బలమైన పునాది వేశారని తెలిపారు. దేశ తొలి ఉప ప్రధానమంత్రిగా, హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సర్దార్ పటేల్ దేశ అంతర్గత భద్రత, పరిపాలనా వ్యవస్థ బలోపేతం, జాతీయ సమైక్యత కోసం విశేషంగా కృషి చేశారని వివరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని 2014 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది అక్టోబర్ 31వ తేదీన దేశవ్యాప్తంగా రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గారు గుర్తుచేశారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా అందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బీ సీఐ రమణమూర్తి, ఏఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు, ఆదినారాయణ, సోషల్ మీడియా సీఐ మారూఫ్, డీసీఆర్బీ సీఐ రమణ, ఆర్ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సమాచార సమన్వయానికి అధికారుల నియామకం

జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.బి.ఎం.సింగ్

ఉదయం ప్రతినిధి - పార్వతీపురం

జిల్లాలో జరగనున్న పట్టణ మరియు గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి ఆదేశాలు జారీ చేశారని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.బి.ఎం.సింగ్ తెలిపారు. నవంబర్ 1 మరియు 3వ తేదీల్లో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల నిమిత్తం పాలకొండ నగర పంచాయతీకి డీఐపీఆర్ఓ కె.బి.ఎం.సింగ్, సాలూరు మున్సిపాలిటీకి డీపీఆర్ఓ ఐ.శ్రీనివాసరావు, ఆఫీస్ సబార్డినేట్ ఎం.ఎం.షరీఫ్, అలాగే పార్వతీపురం మున్సిపాలిటీకి ఎఇఇ యం. గజపతిరావు, డివిజనల్ పీఆర్ఓ జి.వి.రవికుమార్‌లను కేటాయించారు. ?అదేవిధంగా నవంబర్ 5న జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్, నవంబర్ 7న జరగనున్న కౌంటింగ్ ప్రక్రియల పర్యవేక్షణకు అధికారులను విధుల ప్రాతిపదికన నియమించినట్లు చెప్పారు. జి.ఎల్.పురం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కురుపాం, కొమరాడ మండలాలకు సంబంధించి ఉల్లిభద్ర ఉద్యానవన కళాశాల కేంద్రంగా కె.బి.ఎం.సింగ్‌ను నియమించారు. మక్కువ, సాలూరు, పాచిపెంట మండలాలకు సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద డీపీఆర్ఓ ఐ.శ్రీనివాసరావు, ఆఫీస్ సబార్డినేట్ ఎం.ఎం.షరీఫ్ వ్యవహరిస్తారని తెలిపారు. పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం మండలాలకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంగా యం. గజపతిరావును మరియు పాలకొండ, వీరఘట్టం, భామిని, సీతంపేట మండలాలకు పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద జి.వి. రవికుమార్‌లను బాధ్యులుగా కేటాయించినట్లు చెప్పారు. నియమితులైన అధికారులు పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని మీడియా ప్రతినిధులకు అందిస్తూ, మీడియా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ, ఉన్నతాధికారులకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశామన్నారు. కేటాయించిన అధికారులు మరియు సిబ్బంది తక్షణమే విధులకు హాజరు కావాలని ఆదేశించారు.

జిల్లాలో మున్సిపల్, నగర పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం!

ఉదయం ప్రతినిధి - పార్వతీపురం

మన్యం జిల్లా పరిధిలోని పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలతో పాటు పాలకొండ నగర పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7.00 గంటలు నుంచే బ్యాలెట్ పత్రాల ద్వారా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని అన్నారు. మున్సిపాలిటీల వారీగా ఓటర్లు మరియు వార్డుల వివరాలు ఇలా ఉన్నాయన్నారు. పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 40,765 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 19,482 మంది పురుష ఓటర్లు, 21,729 మంది మహిళా ఓటర్లు, నలుగురు ఇతర ఓటర్లు ఉన్నారని చెప్పారు.36 వార్డులకు గాను, 63 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. 140 బ్యాలెట్ బాక్సులతో పాటు 424 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 13 మంది ఎన్నికల అధికారులు, 24 మంది సహాయ ఎన్నికల అధికారులు, 5 గురు జోనల్ అధికారులు, 9 మంది రూట్ ఆఫీసర్స్ విధుల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు పార్వతీపురం పట్టణాన్ని 5 జోన్లగా, 14 రూట్లుగా విభజించి, అన్నిటికీ అధికారులను నియమించినట్లు చెప్పారు. చైర్మన్ పదవికి 4 గురు



అభ్యర్థులు పోటీలో ఉండగా, వార్డు మెంబర్లకు 122 మంది పోటీలో పాల్గొంటున్నారని వివరించారు. సాలూరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 41,934 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 20039 మంది పురుషులు, 21893 మంది మహిళలు, ఇద్దరు ఇతర ఓటర్లు ఉన్నారన్నారు. మొత్తం 32 వార్డులకు సంబంధించి 62 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారని, ఎన్నికల నిర్వహణ కోసం 200 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయడంతో పాటు 33 మంది ఎన్నికల అధికారులు (ఈఓలు), 33 సహాయ ఎన్నికల అధికారులు (ఏఈఓలు) నియమించారని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణ సజావుగా జరిగేందుకు మున్సిపాలిటీని 6 రూట్లు, 6 జోన్లుగా విభజించారని, మొత్తం 450 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించగా, వీరిలో 69 మంది ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), 381 మంది ఇతర పోలింగ్ సిబ్బంది ఉన్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు స్పష్టం చేశారు. పాలకొండ నగర పంచాయతీ పరిధిలో మొత్తం 23,466 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 11,453 మంది పురుషులు, 12,012 మంది మహిళలు, ఒకరు ఇతర ఓటరు ఉన్నట్లు పేర్కొన్నారు. మొత్తం 28 వార్డులకు సంబంధించి 30 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారని, ఎన్నికల నిర్వహణ కోసం 59 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయడంతో పాటు 30 మంది ఎన్నికల అధికారులు (ఈఓలు), 30 సహాయ ఎన్నికల అధికారులు (ఏఈఓలు) నియమించినట్లు చెప్పారు. 6గురు ఏఈఓలను రిజర్వులో ఉంచారు. ఎన్నికల విధుల నిర్వహణ సజావుగా జరిగేందుకు మున్సిపాలిటీని 5 రూట్లు, 3 జోన్లుగా విభజించారని, మొత్తం 120 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించగా, వీరిలో ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది ఉన్నారన్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైందని వివరించారు.

మున్సిపల్ ఎన్నికల విధులపై పోలీస్ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేసిన పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ

ఉదయం ప్రతినిధి - పార్వతీపురం

పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులకు నియమితులైన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎన్నికల విధివిధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ నిబంధనలపై జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి,ఐపిఎస్ గారు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా ప్రజలు, రాజకీయ నాయకులు, అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని గౌరవిస్తూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తమకు కేటాయించిన విధులను పూర్తి బాధ్యతతో నిర్వర్తించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం ప్రదర్శించరాదని సూచించారు. పోలింగు కేంద్రంకు 200మీటర్లు పరిధిలో రాజకీయ పార్టీలు, మద్దతుదారులు ఎటువంటి టెంటులు, స్టాల్స్ ఏర్పాటు చేయకుండా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఓటు హక్కు వినియోగించేందుకు వచ్చే ఓటర్లకు ఇచ్చే స్లిప్స్ పై రాజకీయ పార్టీలు, వ్యక్తులకు సంబంధించిన ఎటువంటి గుర్తులు లేకుండా చూడాలన్నారు. ఓటు హక్కు వినియోగించు కొనేందుకు వచ్చే ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండాను, తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొనే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్లను క్రమపద్ధతిలో క్యూ లైన్లలో పంపించాలని, మహిళలు, వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు అవసరమైన భద్రత, సహకారం అందించాలి. పోలింగు కేంద్రాలకు 200మీటర్ల పరిధిలో ఎవ్వరూ గుమిగూడి ఉండకుండాను, ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లు పోలింగు కేంద్రం పరిసరాల్లో ఉండకుండా చూడాలన్నారు. పోలింగు కేంద్రం పరిసరాల్లోకి అనధికార వ్యక్తులు, వాహనాలను రాకుండా భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ



ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్‌లను అప్రమత్తంగా ఉండాలని, సిబ్బంది తమకు కేటాయించిన విధుల్లో సమయానికి చేరుకొని, సంబంధిత బ్యాలెట్ బాక్సులను నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సురక్షితంగా తరలించాలని, పోలింగ్ ముగిసిన వెంటనే వాటిని పోలీస్ భద్రత నడుమ నిర్దేశిత కేంద్రానికి చేర్చాలని తెలిపారు.

ప్రజలు, రాజకీయ నాయకులు, అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాల్సిన ముఖ్యమైన నియమ నిబంధనలు

శాంతి భద్రతల పరిరక్షణకు 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉంటుందని ఎక్కడ నలుగురు కంటే ఎక్కువ మంది గుమ్మిగూడారాదని తెలిపారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసే హక్కును కలిగి ఉంటారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేయాలని లేదా వేయవద్దని బెదిరించడం, ఒత్తిడి చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం, సామాజిక లేదా ఆర్థిక ఒత్తిడి తీసుకురావడం వంటి చర్యలకు అభ్యర్థులు, వారి అనుచరులు పాల్పడకూడదు. ఎన్నికల సమయంలో ప్రజల్లో భయాందోళనలు సృష్టించే చర్యలను సహించబోమని పోలీస్ శాఖ స్పష్టం చేస్తోంది.

- ప్రజలు, రాజకీయ నాయకులు, అభ్యర్థులు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలి : జిల్లా ఎస్పీ
- ఎన్నికల నియమాలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదు. చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం
- ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా విధులు నిర్వహించాలి : జిల్లా ఎస్పీ

నిభందనలు ఉల్లంఘిస్తే స్వభావాన్ని బట్టి సంబంధిత ఎన్నికల చట్టాలు, భారతీయ న్యాయ సంహిత, ఇతర వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు, మద్యం, బహుమతులు, ఇతర వస్తువులు పంపిణీ చేయడం లేదా వ్యక్తిగత ప్రయోజనాలు కల్పిస్తామని హామీలు ఇవ్వడం వంటి ప్రలోభపూరిత చర్యలకు పాల్పడకూడదు. ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వర్తించే అధికారులు, పోలీస్ సిబ్బంది చేపట్టే చట్టబద్ధమైన తనిఖీలు, భద్రతా చర్యలకు అభ్యర్థులు, వారి ప్రతినిధులు సహకరించాలి. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించడం, అధికారులపై ఒత్తిడి తీసుకురావడం లేదా నిబంధనలను ఉల్లంఘించేలా ప్రవర్తించడం చేయకూడదు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని, రాజకీయ విభేదాల కారణంగా ప్రజల మధ్య వైషమ్యాలు, ఘర్షణలు ఏర్పడకుండా చూడాలని కోరారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, మున్సిపాలిటీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

జాగరం సెగ్మెంట్‌లో వైసిపి అభ్యర్థి అశ్వినిగజపతిరాజుకు బ్రహ్మరథం పడుతున్న ఓటర్లు




ఉదయం ప్రతినిధి - జామి

మండలంలోని జాగరం సెగ్మెంట్ కు సంబంధించి వైసీపీ అభ్యర్థి అయిన అశ్విని గజపతి రాజు జడ్పీటీసీ తులసి త్రివేణికు జాగరం సెగ్మెంట్ కు సంబంధించిన మూడు గ్రామాల ప్రజలు జాగరం పావాడ చింతాడ గ్రామాల ప్రజలు బ్రంహా రథం పడుతున్నారు ఓటు అభ్యర్థునకు వెళుతున్న ర్యాలీలో అనేకమంది ప్రజలుతరలి వస్తూ అశ్వని గజపతి రాజును గెలిపించి తీరుతావని నినాదాలు చేస్తూ ఇంటింటా ప్రచారాలు సాగిస్తున్నారు జాగరం చింతాడ పావాడా ప్రజల్లో మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన వైసిపి ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరగాయని ముమ్ముందు వైసిపి అభ్యర్థులను గెలిపించుకున్నట్లయితే మా గ్రామాలు స్వర్ణ గ్రామాలుగా తీర్చి దిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు వైసిపి ప్రభుత్వం లొ ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు గ్రామాల అభివృద్ధి ప్రతి ఇంటికి ఆర్థిక సహాయం పొందగలి గామని సమావేశంలో ప్రజలు ఎంతో ఉత్సాహంగా ప్రతి ఒక్కరు తమ అభిప్రాయాలను తెలియజేశారు రానున్న స్థానిక ఎన్నికల్లో వైసీపీ పార్టీకి పట్టం కడతారని ఈ సందర్భంగా మూడు గ్రామాలపోతిపిరెడ్డి నరసింహనాయుడు అల్లు పైడంనాయుడు అప్పాన సుబ్రహ్మణ్యం నాయకులకు హామీ ఇచ్చారు

ప్రజా సంక్షేమం. గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తాను

ఎం గుమడం వైసిపి ఎంపీటీసీ అభ్యర్థి రాగోలు సన్యాసమ్మ

ఉదయం ప్రతినిధి - గజపతినగరం



మండలంలోని యం.గుమడం గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానని వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి రాగోలు సన్యాసమ్మ ప్రచార కార్యక్రమంలో అన్నారు ఈ సందర్భంగా గ్రామ పెద్దలు వైసిపి సీనియర్ నాయకులు బొడ్డు రాంబాబు. మిగతా పెద్దలు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు గ్రామంలోని రోడ్లు .డ్రైనేజీ. సంక్షేమం .విద్య. ఉపాధి .మౌలిక వసతులు .కల్పన కోసం తమ వంతు కృషి చేస్తామని ఆమె అన్నారు నియోజకవర్గ సమన్వయకర్త బొత్స అప్పల నరసయ్య ఆశీస్సులతో గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని రేపు జరగబోవు స్థానిక ఎన్నికల్లోవైసిపి ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు అఖండ విజయం చేకూర్చాలని ఆమె కోరారు గతంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలనకు ప్రస్తుత ప్రభుత్వానికి బ్యారేజ్ వేసుకొని వాటర్లో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు గ్రామంలో అభివృద్ధి జరగాలంటే వైసీపీకే సాధ్యమని మాజీ సర్పంచ్ వైసీపీ సీనియర్ నాయకులు రాంబాబు తో సహా మిగతా పెద్దలను కలుపుకొని వారి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఆమె అన్నారు ఈ ప్రచార కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ప్రమాదంలో గాయపడిన వైఎస్ఆర్సిపి రైతు సంఘం నాయకుడు గుడివాడ కృష్ణకు పరామర్శ




ఉదయం ప్రతినిధి - గజపతినగరం

మండలంలోని కెశీగువ గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి రైతు సంఘంనాయకులు గుడివాడ కృష్ణరోడ్డు ప్రమాదంలో గాయపడటంతో తెలుసుకొని వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య శనివారం నాడు కెంగువ ఆయన స్వగృహంలో పరామర్శించారు ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు గుడివాడ కృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణశీ ఆదినారాయణ బెల్లాన త్రినాధ్ లెశీక శ్రీనివాసరావు లెశీక గణేష్. గ్రామ ప్రజలు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వస్తువులకు మెరుగుపడతామని మహిళాకు టోకరా

ఉదయం ప్రతినిధి - గజపతినగరం



బంగారం వెండి వస్తువులకు తల తల మెరిసేలా మెరుగు పెడతామని ఒక మహిళను నమ్మించి బోల్తా కొట్టించిన సంఘటన మెంటాడ రోడ్డు దగ్గరలో న్యూ కాలనీలో చోటు చేసుకుంది స్థానిక ఎస్సై కే కిరణ్ కుమార్ నాయుడు కథనం ప్రకారం స్థానిక న్యూ కాలనీలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించి వస్తువులకు మెరుగు పెడతామని ఒక మహిళను నమ్మించి మోసం చేశారు ఇంటిలోకి ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులలో ఇంటిలో ఉన్న మహిళకు వస్తువులకు మెరుగుపడతామని నమ్మబలికి ఆ ఇద్దరిలో ఒకరు ఆ మహిళ ఇంటి లోనికి ప్రవేశించగా మరో వ్యక్తి బయట ఉండగా ఆ మహిళ మెడలోని సుమారు రెండు తులాల బంగారు తోడును వారికి ఇవ్వగా మెరుగు పెడతామని నమ్మించి వస్తువులు తీసుకొని అక్కడినుంచి వారి పరారయ్యారు ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కే కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు

దీపావళి బాణసంచా విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- హోల్సేల్ లైసెన్స్ కలిగిన వ్యాపారులకే విక్రయాలకు అనుమతి
- రిటైల్ విక్రయాలు పూర్తిగా నిషేధం

ఉదయం ప్రతినిధి - విజయనగరం

దీపావళి పండుగ మరియు స్థానిక సంస్థల ఎన్నికల నేప థ్యంలో జిల్లాలో బాణసంచా విక్రయాలపై ప్రత్యేక నియంత్రణ చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు.జిల్లాలో బాణసంచా విక్రయాలు కేవలం అనుమతులు కలిగిన హోల్సేల్ లైసెన్స్‌దారుల ద్వారా మాత్రమే జరగాలని, హోల్సేల్ ప్రాంగణాల్లో రిటైల్ రూపంలో బాణసంచా విక్రయించడం పూర్తిగా నిషేధించబడిందని స్పష్టం చేశారు. ప్రతి హోల్సేల్ వ్యాపారి ప్రభుత్వం, అగ్నిమాపక శాఖ నిర్దేశించిన భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

బాణసంచా నిల్వ, విక్ర యాల సమయంలో అగ్నిప్రమాదాలు, ఇతర ప్రమా దాలు సంభవించకుండా అన్ని ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి హోల్సేల్ ప్రాంగణాల్లో రిటైల్ విక్రయాలు చేపట్టినా, అనుమతులకు విరుద్ధంగా వ్యవహరించినా సంబంధిత వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్, ఎక్స్‌ప్లోజివ్ లైసెన్సులను తక్షణమే రద్దు చేయడంతో పాటు, పేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా వ్యాపారులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అధికారుల తనిఖీలకు సహకరిం చాలని కలెక్టర్ సూచించారు.

విస్తృతంగా మండల సూర్య కళ ప్రచారం

సుడిగాలీ నీ తలపిస్తున్న వైసీపీ జడ్పిటిసి అభ్యర్థి



ఉదయం ప్రతినిధి - గజపతినగరం

గజపతినగరం మండలంవైసీపీ జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండల సూర్య కళ సుడిగాలిలా దూసుకుపోతూ ప్రచారంలో హోరెత్తిస్తున్నారు మండలంలోని కింగువ .లోగిస .ముచ్చర్ల ఎం కొత్తవలస .రంగు పురం .జిన్నాశే. బంగారంపేట. తదితర గ్రామాల్లో వైసిపి నాయకులతో కార్యకర్తలతో ప్రచారం చేస్తూ నన్ను గెలిపించి అఖండ విజయం చేకూర్చాలని ప్రజలను అభ్యర్థిస్తూ సుడిగాలిలా దూసుకుపోతున్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాకూటమిలో అనేక వాగ్దానాలు చేసిన నాయకులు ఏ ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదని ప్రచారాలకే పరిమితం అయ్యాయని సూపర్ సిక్స్ పథకాలు అమలు జరగలేదని ఆమె అన్నారు ప్రజల సంక్షేమం పాలన అభివృద్ధి వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమని సామాన్యుడికి సంక్షేమ ఫలాలు అందాలన్నా వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు మహిళల సంక్షేమం అభివృద్ధి విద్య ఉపాధి అనేక సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తనను జడ్పిటిసి గా గెలిపిస్తే తన వంతు అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తామని అన్నారు. వైసీపీ సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు బొత్స అప్పలనర్సయ్య ఆశీస్సులతో మండలాన్ని అభివృద్ధి చేస్తాన ని తన భర్త వైసీపీ సీనియర్ నాయకులు మండల సురేష్ తో కలిసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు పల్లి సంజీవరావు బూడి వెంకట్రావు కరుణశీ ఆదినారాయణ. బెల్లాన త్రినాధరావు .కే పై డిపి నాయుడు. వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

Owner,Editor, Publisher : SIVA SANKARA VENKATA PRASADA RAO PALLA, Published from H.NO: 1-19-17, BC COLONY, AGRAHARAM, VIZIANAGARAM, ANDHRA PRADESH - 535004. Printed at NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA , KURNOOL, ANDHRA PRADESH - 518380.
Editor : SIVA SANKARA VENKATA PRASADA RAO PALLA. Registration Number : APTEL/26/A5462